క్లుప్తంగా

నియోజకవర్గానికి నాబార్డు నిధుల మంజూరు

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ: నియోజకవర్గంలో నాబార్డు నిధులు కింద పలు రోడ్డు మరమ్మతులకు రూ.8.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం- బళ్లారి జాతీయ రహదారి వద్ద కొట్టాలపల్లి రోడ్డు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు, కళ్యాణదుర్గం నుండి ఆవులెన్నకు వెళ్లే రోడ్డు కోసం రూ. 55 లక్షలు,రాయంపల్లి రోడ్డు నిర్మాణానికి రూ. 3.20 కోట్లు, విడపనకల్లు నుంచి వి.కొత్తకోటకు వెళ్లే రహదారి కోసం రూ.1.30 కోట్లు, చీకులగురికి రోడ్డు మరమ్మత్తులకు రూ. 1.50 కోట్లు, కాలువపల్లి నుంచి జీడిపల్లి కు గ్రామానికి రోడ్డు మరమ్మత్తులకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

తెగి పడిన 11 కేవీ విద్యుత్ తీగలు



నెరిమెట్ల గ్రామ సమీపంలో పొలంలో తెగిపడ్డ 11కేవీ విద్యుత్ వైరు

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్ల-మల్లాపురం గ్రామాల మధ్య 11కేవీ ప్రధాన లైను తీగలు తెగిపడ్డాయి. రెండు రోజుల నుంచి సర్పంచ్ యోగేంద్రరెడ్డి, గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులు, మండల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదు. రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని నెరిమెట్ల, మల్లాపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బేతని బాప్టిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యవర్గ సభ్యులు

కణేకల్లు: రాయదుర్గం తాలుకా బేతని బాప్టిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం కణేకల్లు క్రాస్‌లోని బేతని బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాస్టర్లు నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాయదుర్గం తాలుకా బేతని బాప్టిస్ట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ అనంతకుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఆదం, కోశాధికారిగా ఎం.బసవరాజు, కార్యదర్శిగా వి.థామస్, సహాయ కార్యదర్శిగా హెచ్.రవి ఎన్నికయ్యారు. సభ్యులుగా అజర్య, ఎం .ఓబద్య, హెచ్.ఇసాక్, జేమ్సులు ఎన్నికయ్యారు. ఈ కమిటీతోపాటు వివిధ మండలాలకు ఇన్‌చార్జ్‌లను కూడా నియమించినట్లు రాయదుర్గం తాలుకా బేతని బాప్టిస్ట్ పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ అనంతకుమార్ తెలిపారు. కణేకల్లు మండల బేతని బాప్టిస్ట్ చర్చిల నిర్వనిర్వాహక ఇన్‌చార్జ్‌గా వి.థామస్, రాయదుర్గం ఇన్‌చార్జ్‌గా ఎం.బసవరాజు, బొమ్మనహాళ్ ఇన్‌చార్జ్‌గా ఎస్.ఆదం, ఉరవకొండ, బెలుగుప్ప మండలాల ఇన్‌చార్జ్‌గా ధనరాజును నియమించినట్లు ఆయన తెలిపారు.

'స్పాంజ్' ఫ్యాక్టరీ బాధిత రైతులకు పరిహారం పంపిణీ



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు పరిధిలోని స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంతో నష్టపోయిన రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్యంతో పంటలు పండడం లేదని నష్టపోతున్నామని నేమకల్లు రైతులు, రైతు సంఘం నాయకులు ఆరోపించారు. యజమానులు రైతులకు కొన్నేళ్లుగా అరకొర పరిహారం అందించేవారు. ఈసందర్భంగా పరిహారం మొత్తం పెంచాలని డిమాండ్ చేస్తూ రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. ఎట్టకేలకు ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి వారికి ఎకరానికి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు పరిహారం మొత్తాన్ని పెంచారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున మాట్లాడుతూ పరిహారం ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు సర్వేష్, విజయ్, యుగేంధర్, సీపీఐ రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, వశికేరప్ప, రామాంజి, కృష్ణయ్య, ప్రకాష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలివేటు



బీటీపీ రోడ్డులో నేలకూలిన చింతవనం



పైతోటలో నరికేసిన పెద్ద చెట్లు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి..పచ్చని చెట్ల నరికివేస్తే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవు.. అని ప్రచారం చేస్తున్నా.. కొందరు స్వార్థపరులు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నారు. కొందరు స్వార్థపరులు చెట్లు నరికి కలపను లారీలు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తూ, అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. పచ్చదనాన్ని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- తరిగిపోతున్న పచ్చని సంపద
- పట్టించుకోని అధికారులు



రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఆయా పరిసరాల్లో అనేక మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. చెట్లతో పచ్చని అడవులు స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి చెట్లను నేలకూల్చి ప్రకృతి వినాశనానికి కారకులవుతున్నారు. ఇటీవల పట్టణ పరిసరాల్లో 120 చింత వట వృక్షాలను నేల కూల్చి వెంచర్లుగా మార్చారు. పొలాల్లో గట్టు వెంబడి పెరిగి పెద్దయిన కలపను అక్రమార్కులు నరికించి తరలించేస్తున్నారు.

భవిష్యత్తు తరాలకు ముప్పే..

రాయదుర్గం ప్రాంతంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పచ్చదనాన్ని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా.. కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు తదితర ప్రాంతాలకు నుంచి వస్తున్న కలప పట్టణం మీదుగా కర్ణాటక రాష్ట్రం వైపు నిత్యం తరలివెళ్తోంది. దీంతో జనాభాకనుగుణంగా మొక్కలు నాటకపోవడం, ఉన్న వాటిని నేలకూల్చడం లాంటి ఘటనలు చోటు చేసుకుంటుండడంతో ప్రకృతి ప్రకోప పరిస్థితులు వెంటాడుతున్నాయి. వేసవి ముందే ఎండలు బాదడం ..అకాల వర్షాలు కురవడం, కార్తెల సమయంలో వర్షాలే కురవక పోవడం లాంటి కారణాలు అద్దంపడుతున్నాయి. ఈ విధానంలో మార్పు కనిపించకపోతే భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

చట్టం ఏం చెబుతోందంటే..?

పట్టా భూమిలో చెట్టు నరకాలంటే సంబంధిత తహసీల్దారు ధ్రువపత్రాన్ని అటవీశాఖ అధికారులకు అందించాలి. అనంతరం మొక్కలు అంచనావేసి కోత అనుమతి కోసం జిల్లా అటవీ అధికారికి నివేదికలు పంపాలి. ఈ రికార్డులు పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. అలా జిల్లా అధికారులు పర్మిట్ ఇస్తే ఒక్కో టన్ను కలపకు రూ.16,800 లేదా అందుకు ఐదు రెట్లు పెంచి చెల్లించాలని సూచిస్తారు. అది చెల్లిస్తే అనుమతిస్తారు. పట్టణంలో నేలకూల్చిన చింత వనానికి ఈ నిబంధనలు వర్తించలేదు.

విచ్చలవిడిగా వెలుస్తున్న ఇటుక బట్టీలు

కర్ణాటకలో అటవీ అధికారులు కలప నరికివేతపై ఉక్కుపాదం మోపుతారు. దీనివల్ల ఇటుకల తయారీదారులు ఇటుకలను బొగ్గు, వరిపొట్టు, చింతపొట్టుతో కాల్చుతారు. అదే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ ప్రాంతాల్లో అయితే ఇటుకలను కాల్చేందుకు కలప వినియోగిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం అంతరించిపోతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఇటుకల బట్టీలోకి వెళ్లినా కలప గుట్టలకొంది దర్శనమివ్వడమే ఇందుకు నిదర్శనం.

చర్యలు తీసుకుంటాం

కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. డివిజన్ పరిధిలో అక్రమ రవాణా సాగడం లేదు. దూర ప్రాంతాల నుంచి రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా తరలివెళ్లే కలపను సైతం నిశితంగా పరిశీలించి పంపేలా చర్యలు చేపడతాం. అడవుల వినాశనాన్ని కోరుకుంటే ఎంతటి వారైనా సరే విడిచిపెట్టేది లేదు. ఇటుకల బట్టీల్లో కలప పట్టుబడితే చర్యలు తీసుకుంటాం. వేసవి ముగిసే వరకు అడవులు, కొండల్లో కార్చిచ్చు రగల్చకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

– మధుబాబు, ఫారెస్ట్ రేంజర్, కళ్యాణదుర్గం

కవర్లతో తెగుళ్ల నివారణ

కుందుర్పి: కవర్లతో మామిడి కాయలకు వచ్చే తెగుళ్లను నివారించొచ్చని హార్టికల్చర్ అధికారిణి గౌసియా, కుసుమగిరి రైతు సంఘం సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. శనివారం వారు కుందుర్పి, కంబదూరు, శెట్టూరులో మామిడి రైతులకు తెగుళ్ల నివారణ, కాయలకు కవర్లు కప్పి తెగుళ్ల నుంచి ఎలా రక్షించుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. కుందుర్పిలోని కుసుమగిరి ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో కవర్లు అందుబాటులో ఉంచామని సబ్సిడీతో రైతులకు అందజేస్తామని అన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులోని శ్రీసరస్వతీ విద్యా మందిర్ 29వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. స్థానిక శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానం బృందావనంలో పాఠశాల అధ్యక్షుడు పోరాళ్ల ధనార్జున, ప్రధాన ఆచార్యులు రాజేశ్వరి, సమితి కార్యదర్శి సోమ నీలకంఠ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వెంకటరమేష్, ప్రముఖ వైద్యుడు గోపాలరావు హాజరయ్యారు. విద్యా మందిరం చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్యం, కోలాటం, యోగ అనేక రకాల కార్యక్రమాలకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కారుమంచి, తుకారం, శివకుమార్, సాంబమూర్తి, హులికుంట మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్



కళ్యాణదుర్గం: జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాయదుర్గంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఉరవకొండ: పేదలకు అన్నదానం చేస్తున్న దండోరా నాయకులు

రాయదుర్గంటౌన్: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప అన్నారు. శనివారం శనివారం మెట్టు క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. పోరాళ్ల శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జగ్జీవన్ రామ్ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి పోరాళ్ల శివకుమార్, పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గొల్ల రామాంజనేయులు, పట్టణ మహిళా విభాగం కన్వీనర్ శారదా దేవి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కౌన్సిలర్లు పోరాళ్ల గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు రామాంజనేయులు, నిజాముద్దీన్, బషీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు అరవింద్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని బళ్లారి మిట్టపై ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేష్, మున్సిపాల్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్ఆర్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అఫ్జల్, కౌన్సిలర్లు పరమేశ్వప్ప, లక్ష్మన్న, మండల కన్వీనర్ గోళ్ల సూరి, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, వికలాంగుల అధ్యక్షుడు పాతలింగ, మున్సిపాల్ విభాగం మురళి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు షేక్షా, నాయకులు మాజీ డీలర్ జాకీర్, బోరంపల్లి రామిరెడ్డి, సూరి, మల్లాపురం మల్లి, అనంద్, బిక్కి హరి, ఇటుకుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని సర్పంచు లలితమ్మ, దళిత సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. శనివారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వివిధ దళిత సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు.

దండోరా అధ్వర్యంలో పేదలకు అన్నదానం

ఉరవకొండ: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా దండోర రాయలసీమ అధ్యక్షుడు రాజు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొకుంట్ల రవి, రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద డీజీహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మీనగ గోపాల్, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు సాకే భాస్కర్, మీనుగ భాస్కర్, సాకే పురుషోత్తం, పృధ్వీ, ఎల్లప్ప, డేవిడ్ మధు, రామాంజనేయులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఊరూరా ఉట్టి పడుతున్న భక్తిభావం

- నేడు సీతారాముల కల్యాణోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు



అలంకరణలో సీతారాములు



వజ్రకరూరులో కానిగాకు బండి తీసుకొస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఆదివారం జరిగే వేడుకలకు పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. పట్టణ సమీపంలోని ఎల్లమ్మ కొండపై వెలసిన పురాతన విజయనగరరాజుల నిర్మిత పట్టాభి సీతారామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, 10 గంటలకు హోమం, 11 గంటలకు పట్టాభి సీతారామస్వామి కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు దబ్బడి మంజునాథ తెలిపారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులోని కోదండ రామస్వామి, కోటలో వెలసిన నగరేశ్వరస్వామి ఆలయంలో సీతారామ ఆలయం, లక్ష్మీబజార్‌లోని లక్ష్మీనారాయణ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం, గొల్లపల్లి, భూసముద్రం గ్రామాల్లో శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. ఆదివారం రోజున జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఆయా గ్రామాల్లో అలంకరించిన రథాలపై సీతారాములు, లక్ష్మణుల విగ్రహాలను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రారంభమైన శ్రీరామస్వామి రథోత్సవం

కుందుర్పి: మండలంలోని వెంకంటపల్లిలో వెలసిన శ్రీరామస్వామి రథోత్సవం శనివారం ప్రారంభమైంది. ఏటా శ్రీరామనవమి పండుగ ముందురోజు ఉత్సవాలు పారంభమవుతాయి. శనివారం స్వామికి అభిషేకం, ఉత్సవం, ఆదివారం గ్రామోత్సవం, తమలపాకుల ప్రత్యేక పూజ, రాత్రికి అఖండ భజన కార్యక్రమం, సోమవారం సాయంత్రం స్వామి రథోత్సవం, రాత్రికి వెండిపల్లకీ ఉత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ పేర్కొంది.

బొమ్మనహాళ్: శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. రామాలయాలతో పాటు ఆంజనేయ స్వామి ఆలయాలు ఉత్సవాలకు సిద్ధం చేశారు. మండల కేంద్రంలో సీతారామాంజనేయస్వామి ఆలయం, ఉద్దేహాళ్ సీతారాముల దేవస్థానం, ఎల్‌బీనగర్ సీతారాముల ఆలయం, నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం, కురువల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో, రంగాపురం క్యాంపులో ఆంజనేయస్వామి ఆలయాల్లో నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో విద్యుత్ దీపాలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం శ్రీరామనవమి రోజున ఆలయాల్లో జరిగే సీతారాముల కల్యాణానికి భక్తులు తరలివస్తారని ఏర్పాట్లు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు వైభవంగా రథోత్సవాలు

వజ్రకరూరు: మండలంలోని పందికుంట, గూళ్యపాళ్యం, రాగులపాడు, ధర్మపురి తదితర గ్రామాల్లోని సీతా రాముల ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి.వజ్రకరూరులోని సీతారామస్వామి ఆలయంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలతోపాటు విశేష పూజలు, అర్చనలు, అభిషేకం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వజ్రకరూరు, పందికుంట, రాగుల పాడు, ధర్మపురి, గూళ్యపాళ్యం గ్రామాల్లో ఆదివారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవం జరగనుంది. అనంతరం మధ్యాహ్నం స్వామి కానుగాకు బండి కార్యక్రమం, నిబ్లం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు స్వామి బావి నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు.

కూడేరు: ప్రసిద్ధిగాంచిన బసాపురం ఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దుర్గచైతన్య తొలుత ఆంజనేయస్వామి మూల విరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. వివిధ రకాల పట్టువస్త్రాలు, పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం ఆకుపూజ చేశారు. రాత్రికి పల్లకీలో ఆంజనేయ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ముస్తాబైన రామాలయాలు

కూడేరు: మండల కేంద్రంలోని కోదండరామస్వామి, కొర్రకోడు, కరుట్లపల్లి, ముద్దలాపురంతోపాటు మరి కొన్ని గ్రామాల్లోని ఆలయాలను శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబు చేశారు. కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామి నవమిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

వాల్మీకి విగ్రహ కలశస్థాపన



హోమం నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కుందుర్పి: మండల కేంద్రంలో వాల్మీకి విగ్రహ ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం ఉదయం హోమం, మధ్యాహ్నం కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు చిన్నారులతో కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం శుద్దల కోన ఆశ్రమ పీఠాధిపతి సంజీవ్‌కుమార్, కుందుర్పి, వైఎస్‌హెచ్ కోట వాల్మీకుల దొర జయచంద్రరాజు చేతుల మీదుగా వాల్మీకి విగ్రహాన్ని ప్రారంభిస్తున్నట్లు వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు.

'చంద్రబాబు ద్రోహాన్ని ముస్లింలు క్షమించరు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు

ఉరవకొండ: వక్ఫ్ సవరణ బిల్లుపై చంద్రబాబు చేసిన ద్రోహాన్ని ముస్లింలు ఎప్పటికీ క్షమించరని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ నేతలు బళ్లారి ఆసీఫ్, మోమిన్ జిలాన్, శింగనమల ఉస్మాన్, జీఎంఎస్ మీరంబాషా, వన్నూర్ సాబ్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై పార్టీ మైనార్టీ విభాగం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మైనార్టీ విభాగం నేతలు మాట్లాడుతూ చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపి దీన్ని కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారన్నారు. వక్ఫ్ అంటే ముస్లింలు దానం చేసిన ఆస్తులని, దీనిపై పూర్తిగా వారికే హక్కు ఉంటుందన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ:

వక్ఫ్ సవరణ బిల్లును మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తోందని, వైఎస్సార్‌సీపీ అధినే వైఎస్ జగన్ నిర్ణయాన్ని మైనార్టీలు స్వాగతిస్తున్నారని మైనార్టీ నాయకులు అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని తన ఎంపీలకు విప్ జారీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న మైనారీలు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు బయటకు వచ్చి వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ నాయకులు బొంబాయి సెట్ మైను, షేక్‌హబీబ్, టైలర్ శర్మాస్, బాబా ఫరీద్, అయ్యర్‌దాదు, మహ్మద్‌వలి, అల్లా బకష్ పాల్గొన్నారు.

శ్రీరామనవమిని సంతోషంగా జరుపుకోవాలి



వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: శ్రీరామనవమి పర్వదినాన్ని నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి కోరుకున్నారు. శనివారం ఆయన ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రతి ఇంట్లో సుఖ సంతోషాలతో నిండాలని, రైతుల కష్టాలు తీరాలని, పాడి పంటలతో తులతూగాలని ఆకాంక్షించారు.

శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు



వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉరవకొండ: నియోజవర్గ ప్రజలకు ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై. శివరామిరెడ్డి శనివారం శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. లోకకల్యాణం కోసం భగవంతుడు శ్రీరాముడి రూపంలో మానవజన్మ ఎత్తారని, యావత్తు మానవాళికి శ్రీరాముడి జీవితం ఆదర్శమని ఆయన అన్నారు.

జంబుకేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలందుకున్న శ్రీజంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: స్థానిక కోటలో వెలసిన మహిమాన్వితుడు స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 15 వరకు జరుగుతాయని గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి తెలిపారు. తొలి రోజు శనివారం సాయంత్రం ఆలయంలో అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో అంకురార్పణ, కలశస్థాపన, రాత్రి రక్షాబంధనం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. ఆదివారం ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం సూర్యప్రభ వాహనోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు.

నేటి నుంచి యణ్ణే రంగస్వామి ఉత్సవాలు

కణేకల్లు: యర్రగుంటలో యణ్ణే రంగస్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామి నిత్య పూజలందుకుంటున్నారు. ఏటా శ్రీరామనవమి పండుగ రోజు నుంచి స్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం ఉత్సవం, సోమవారం రథోత్సవం జరగనుంది. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి పెయింటింగ్ వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఏకాదశి రోజు భగళాంబ పరుష జరుగనుంది. ఈ వేడుకలను పురస్కరించుకొని గ్రామంలో ఎద్దుల పరుష నిర్వహించనున్నట్లు ప్రజలు తెలిపారు. పరుషలో ఎద్దుల క్రయ,విక్రయాల కోసం వచ్చే రైతులకు భోజన వసతి, పశువులకు గ్రాసం అందుబాటులో ఉంచనున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేసిన దృశ్యం

వజ్రకరూరు: వెంకటాంపల్లిపెద్ద తండా గ్రామ పరిసర ప్రాంతంలో శనివారం గుంతకల్లు ప్రొహిబిషన్-ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల్లో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల నాటు సారాను సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివసాగర్ తెలిపారు. ఎస్ఐలు వెంకటేశం, సుశీలమ్మ, కానిస్టేబుల్ సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.